# చంద్రబాబునాయుడు కోసం ప్రత్యేక పూజలు



ఊరు వాకిలి ఆంజినేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న సవిత

**పెనుకొండ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆయురారోగ్యాలతోపాటు మనోధైర్యం పంపించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిసవితమ్మ మంగళవారం పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, కన్యకాపరమేశ్వరి దేవాలయం, కోటఆంజినేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక మైనపూజలు, అర్చనచేయించారు. ఆయుఆరోగ్యాలతో మనోధైర్యం కల్పించాలని తొందరగా బెయిల్ రావాలని దేవుణ్ణి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవ నాయుడు, చంద్రమౌళి, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు డివి. ఆంజినేయులు, గుట్టూరు మాజీ సర్పంచు సూర్యనారాయణ, మాజీ ఎంపిటిసి నారాయణస్వామి, కోనాపురం కేశవయ్య, మాజీ ఎంపిటిసి రమణమ్మ, లక్ష్మీదేవమ్మ, అడదాకులపల్లి మాజీ సర్పంచు ప్రసాద్, ఎర్రమంచి మాజీ సర్పంచు సోమశేఖర్, మాగే చెరువు సర్పంచు నరసింహులు మారుతి ప్రసాద్, నరసింహులు, ఐటిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మంజునాథ్, శ్రీనాథ్‌చౌదరి విట్టాపల్లి సర్పంచు నాగరాజు, మాజీ వైస్ సర్పంచి సుబ్రహ్మణ్యం శెట్టి నంజప్ప, చిన్న పోతన్న, కోనాపురం ప్రసాద్, కోనాపురం సుబ్బు, గ్రామ కమిటీ అధ్యక్షుడు లింగేశ్వర, వీరచిన్న, బుసప్ప, ఆదినారాయణ, బాలాజీ నాయక్, మల్లికార్జున, సానిపల్లి వెంకటేష్, మోపర్లపల్లి లింగప్ప కిష్టప్ప, తిరుపాల్‌నాయుడు, పురుషోత్తం నాయుడు, వాసుదేవరెడ్డి, శ్రీనివాసులు, నాగభూషణ, పుట్టగూర్లపల్లి రామాంజి, రాము, రంగనాథ్; బాబు, శ్రీకాంత్, అనిల్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు కోసం మైనార్టీల ప్రత్యేక ప్రార్థనలు



బాబయ్య స్వామి దర్గాలో పూజలు నిర్వహిస్తున్న తేదేపా యువ నాయకులు

**పెనుకొండ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు క్షేమంగా జైలు నుంచి విడుదల కావాలని పట్టణంలోని బాబయ్య స్వామి దర్గాలో మంగళవారం తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ అధికార ప్రతినిధి హుజూరుల్లా ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హుజూరుల్లాఖాన్ మాట్లాడుతూ.. భారతదేశంలో అత్యంత శక్తివంతమైన రాజకీయ నేతల్లో చంద్రబాబునాయుడు ఒక్కరన్నారు. అవినీతిచరిత్రలేనివ్యక్తి చంద్రబాబు అనిస్వచ్చమైన నాయకుడిని కక్షపూరితంగా అక్రమ కేసులో అరెస్టుచేసి రిమాండ్‌కు పంపడం అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ నాలుగున్నర ఏళ్ల వైకాపా పాలనలో రాష్ట్రం రావణకాష్టంలా తయారైందని విమర్శించారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా కడిగిన ముత్యంలా చంద్రబాబునాయుడు బయటకు వస్తారని తెలిపారు. తెలుగుప్రజల అభిమాననేత చంద్రబాబునాయుడుకు మనోధైర్యం కల్పించాలని స్థానిక బాబయ్యస్వామిదర్గాలో దువా చేయించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు హాజీ ఖలీల్, టెంకాయల హాజీ ఫరూక్, అమానుల్లా, టివి.సలీమ్‌సాబ్, షమున్, డాక్టర్ నూర్, మటన్ ఖదీర్, అబ్దుల్ ఖాదర్, జీలాన్, సత్యసాయిజిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి ఎస్‌జె.జావీద్, సత్యసాయి జిల్లా వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి షౌకత్ అలీ, సత్యసాయి జిల్లా ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షులు అత్తార్ ఖధీర్, నియోజకవర్గం ముస్లి మైనార్టీ నియోజకవర్గం అధ్యక్షులు రియాజ్ బాషా, మైనార్టి పట్టణ అధ్యక్షులు సయ్యద్, నియోజకవర్గం మైనార్టీ ఉపాధ్యక్షులు వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కరియమ్మ దేవత వార్షికోత్సవం



**అగళి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

మండల పరిధిలోని నందరాజనపల్లిలో వెలసిన కరియమ్మ దేవత వార్షికోత్సవం మంగళవారం రోజు గ్రామస్తులు, భక్తులు కలిసి ఘనంగా నిర్వహించారు. దేవిని వివిధ రకాల పూలతో అలంకరించారు. మామిడి అరటి తోరణాలతో దేవాలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతియే టా మంగళవారం దేవికి వార్షికోత్సవం జరుపుకోవడం ఆనవాయితీ. గ్రామంలో ఉన్న ప్రతి ఇంటి వారు, 2 కిలోల బియ్యం, 100 రూపాయల వంతున చందా వేసుకుని వార్షికోత్సవం నిర్వహిస్తారు. పంచామృతా భిషేకం, మహా మంగళహారతి అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

## ఘనంగా సబ్రహ్మణ్యస్వామి పూజలు



**అగళి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** రత్నగిరి గ్రామంలో వెలిసిన పురాతన శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం ప్రీతికరమైన రోజు సదరు రోజు స్వామిపూజకు విశేష సంఖ్యలో భక్తులు హాజరవుతారు. స్వామిని నిష్ఠతో వేకువజామునుంచే పూజారి వివిధ రకాల పూలతో అలంకరిస్తారు. సుబ్రహ్మణ్య స్వామి నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా దేవాలయం ఉండటం మూలంగా అగళి, రొళ్ల మండలాల నుంచే కాకుండా ఇతరాత్ర ప్రాంతాల నుంచి స్వామికి పూజలు చేయించడానికి మహిళలు హాజరవుతారు. వివాహం కాని వారు పనులు జరగని వారు సమస్యలు ఎదుర్కొంటున్న వారు ఆరోగ్యం సరిగా లేని వారు పిల్లలు లేని వారు ఈ స్వామికి తరచూ నిష్టగా ఉండి పూజలు చేస్తారు. ఈ స్వామికి పూజలు చేసే పురోహితులు, స్వామిని అభిషేకాలు పూర్తి అయిన తర్వాత మహా మంగళ హారతి, ప్రసాద వినియోగం ఒంటి గంటకు జరుగుతుంది. అంతవరకు స్వామి గుక్కెడు నీటిని కూడా ముట్టుకోక చాలా నిష్టతో పూజలు చేస్తారు. శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేయించి స్వామి ఆశీర్వాదం పొందితే సమస్యలు పరిష్కారం అవుతాయని, అంతా మంచే జరుగుతుందని భక్తుల విశ్వాసం.

# ఘనంగా 19వ వార్షికోత్సవ మహాసభ వేడుకలు

**కనగానపల్లి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న వైఎస్ఆర్‌సిపి క్రాంతి పదం ఏపిఎం హేమలత

మండల కేంద్రం లోని వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం కార్యాలయంలో 19 వార్షికోత్సవం మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపిఎం హేమలత మాట్లాడుతూ.. యానిమేటర్లు, గ్రూపు సభ్యులు సమన్వయంతో పనిచేసి సంఘాలను అభివృద్ధిలోకి తీసుకురావాలని తద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని అన్నారు. అలాగే సమిష్టి కృషితో ఏదైనా సాధజంచవచ్చని ఈ సందర్భంగా వారికి తెలియజేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మండల సమైక్య సంఘం సభ్యుల పదవీ కాలం ఒక సంవతసrం పాటు సభ్యుల ఆమోదం చేత పొడిగించారు. ఈ కార్యక్రమంలో సిసిలు రాయప్ప, చంద్రచారి, సుగుణ, చంద్రశేఖర్, అంజప్ప, మండల సమైక్య సంఘం సభ్యులు, యానిమేటర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# మట్కా బీటర్ అరెస్ట్ ..



విలేకరుల సమావేశంలో ఎస్సై లోకేష్‌బాబు

**మడకశిర టౌన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెనుకొండ డిఎస్పీ ఆధ్వర్యంలో సిఐ సురేష్‌బాబు పర్యవేక్షణలో మడకశిర పట్టణంలోని ఆరెపేటకు చెందిన ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళశారం మట్కా బీటర్ మట్కా స్లిప్పులు రాస్తుండగా రెడ్‌హ్యాండడ్‌గా పట్టుకున్నారు. ఆ వ్యక్తిని అరెస్టు చేసి వ్యక్తి వద్ద నుంచి రూ.11, 340 వేల రూపాయలు మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకున్నారు. అమాయకులైన కూలీలకు ఆశ చూపి ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్సై లోకేష్ హెచ్చరించారు. గతంలో మట్కా నిర్వహించిన వారి కదలికలపై నిఘా ఉంచామన్నారు. మట్కా గ్యాంగ్ మాయమాటలు చెప్పే వారి మాయలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన ప్రజలకు తెలిపారు. ఈ మెరుపు దాడిలో ఏఎస్ఐ కృష్ణారెడ్డి, హోంగార్డు బాబు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సెలూన్ షాపు దగ్ధం

- రూ.1.2 లక్షల రూపాయలు ఆస్థి నష్టం



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన సెలూన్ షాపును చూపుతున్న బాధితుడు మంగల హనుమంతు

**ఉరవకొండ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సెలూన్ షాపు దగ్ధమైన ఘటన మంగళవారం తెల్లవారుజామున ఉరవకొండ పట్టణంలో చోటు చేసుకొంది. బాధితుడి ద్వారా తెలిసిన మేరకు వివరాల్లోకి వెళితే...పట్టణంలోని వెంకటేశ్వర లాడ్జీ ముందు వైపున మండల పరిధిలోని బూదగవి గ్రామానికి చెందిన మంగల హనుమంతు గత 13 సంవత్సరాలుగా సెలూన్ షాపు నిర్వహిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో షాపుకు ఆనుకొని వెళ్లిన విద్యుత్ సర్వీస్ వైరు షార్ట్ కావడంతో నిప్పురవ్వలు దుకాణంమీద పడి అందులోని విలువైన ఛైర్, షోకేజ్, ఇతరత్రా పరికరాలు కాలి బూడిద కావడంతో 1.2 లక్షల రూపాయలు ఆస్థినష్టం జరిగిందని బాధితుడు హనుమంతు తెలిపాడు. బ్యాంకులో రుణం తీసుకొని షాపు పెట్టానని రెక్కాడితేగాని డొక్కాడని తనకు ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు రెవిన్యూ అధికారులకు వినతిపత్రం అందించాడు.

# స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబును అరెస్టు చేయడం సబబే

**మడకశిర టౌన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** చంద్రబాబు అరెస్టు అక్రమం అంటూ ఆ పార్టీ శ్రేణులు పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఆయన ఆరోపించారు. సిఐడి వారు కేసును ముందు నుంచే ఆధారాలు సేకరించి చంద్రబాబును అరెస్టు చేయడమే కాకుండా కోర్టులో కూడా ప్రాతమిక ఆధారాలు సమర్పించిన నేపథ్యంలోనే రిమాండ్‌కు న్యాస్థానం ఆదేశించిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అక్రమం అంటూ పేర్కొనడం సబబు కాదని అందులోనూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇలాంటి చర్యలు రాజకీయంగా ఎవరు చేపట్టారని కేవలం తమ అధికారంలో ఉన్నప్పుడు స్కిల్ వెలప్‌మెంట్ స్కీమ్‌లో అవినీతి అక్రమాలకు పాల్పడిన నేపథ్యంలోనే ఈ కేసు వారి మెడకు చెట్టుకుంది. తప్ప అక్రమం కాదని ఆయన ఖండించారు. గతంలో ఎన్టీఆర్‌ను ఇదే సమయంలో వంచించిన పాపమే నేడు వెంటాడుతూ ఉందని ఆయన జోష్యం చెప్పారు. వారు తప్పు చేయకపోతే న్యాయ స్థానం ఎలా విశ్వసిస్తుందని ఆయన పేర్కొన్నారు. అధికారంలో ఉన్నంతకాలం ఈ స్కాంను అడగదొక్కుతో రావడం నిజం కాదా న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంటే న్యాయ స్థానంలో వారి నిజాయితీని నిరూపించుకోవాల తప్ప తనకు తానుగా నిప్పు ఉప్పు అంటూ ప్రగల్బాలు పలకడం తప్పని ఆయన విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ చంద్రబాబును అరెస్టు చేయించి ఇది కేవలం సిఐడి సుదీర్ఘ దర్యాప్తు చేసి ఆధారలు సేకరించిన అనంతరమే అరెస్ట్ పూనుకొందని ఆయన తెలిపారు. గతంలో మా అధినేత జగన్ సైతం న్యాయ వ్యవస్థను ఆశ్రయించి తన నిజాయితీని నిరూపించుకోవడానికి ప్రయత్నించారే తప్ప వ్యవస్థల్ని ప్రభావితం చేసి లబ్ది పొందాలని ఆలోచన చేయలేదని సందర్భంగా వారు గుర్తు చేశారు.

## ఉచిత బస్సు పాసులు పంపిణి

**ధర్మవరం రూరల్,సెప్టెంబర్ 12,ప్రభాతవార్త:** పట్టణంలోని సంజయ్ నగర్‌లో గల బిఎస్సార్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో గ్రామీణ ప్రాంతాల నుండి పాఠశాలరు వచ్చి చదువుతున్న విద్యార్థినిలు అందరికి దాత చింతా రంగయ్య సహాయ సహకారంతో ఆర్టీసీ బస్సు పాసులను వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా దాతతో పాటు డిపో మేనేజర్,కౌన్సిలర్ వెంకటరాముడులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఉమాపతి మాట్లాడుతూ ధర్మవరంలో దాతలకు కొదవలేదని. దాతల సహాయ,సహకారాలను ఉన్నడు మరవకుండా,చదువులో ప్రత్యేక శ్రద్ధను కనబరిచి తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని వారు తెలిపారు. విద్యార్థునులు అందరు కూడా ఆటోలో ప్రయాణించి ప్రమాదమును కొని తెచ్చుకోవద్దని సురక్షితమైన ఆర్టీసీ బస్సులో ప్రయానించాలని తెలిపారు. అనంతరం దాత,డిపో మేనేజర్,వార్డు కౌన్సిలర్ నీలురి వెంకటరాముడును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ యూనియన్ నాయకులు నాగార్జునరెడ్డి,వైవిఎస్‌రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు బృదం విద్యార్థినిలు పాల్గొన్నారు.



ఉచిత బస్సుపాసులను అందిస్తున్న దృశ్యం

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని ఇందులో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పవని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. వజ్రకరూరు మండల కేంద్రంలో మంగళవారం ఆయన మండలంలోని చిన్నహోతూరు, పెద్దహోతూరు, గూళపాళ్యం సచివాలయాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ రమావత్ దేవిబాయి అధ్యక్షత వహించగా వైస్ ఎంపీపీ సుశీలరాణి, సర్పంచ్ మోనలిసా, ఎంపీడీఓ విజయలలిత, ఇంచార్జ్ తహశీల్దార్ చంద్రశేఖర్, పీఏసీఎస్ ఛైర్మెన్ సుధీర్‌రెడ్డి, కమలపాడు సర్పంచ్ తిరకమ్మ, వైసీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, వెంకటరెడ్డి, సామానాయక్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలు ఎంతవరకు పరిష్కారమయ్యాయని అడిగి తెలుసుకున్నారు. ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం 20 లక్షల రూపాయల నిధులను సమస్యల పరిష్కారానికి కేటాయించిందని వాటిని వినియోగించుకొని ప్రధానంగా తాగునీరు, విద్యుత్, వీధిలైట్లు, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఫిరోజ్‌బాను, వైసీపీ నాయకులు, సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆమిద్యాలలో ఘనంగా ఉట్ల పరుషోత్సవం

- శ్రీ లక్ష్మినరసింహస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు



శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులవద్ద పూజలు చేస్తున్న భక్తులు



ఉట్లమాను ఎక్కే కార్యక్రమం జరుగుతున్న దృశ్యం

**ఉరవకొండ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో శ్రీ విలంబినామ సంవత్సరం శుక్రవారం సాయంత్రం ఉట్ల పరుషోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రతి యేడాది శ్రావణ బహుళ త్రయోదశి నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం స్థానిక శ్రీ పెన్నహోబులేసుని ఆలయంలో భద్రపరిచిన శ్రీదేవీ, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను పెన్నహోబిళం శ్రీ లక్ష్మినరసింహాస్వామి దేవాలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో గ్రామంలో ఊరేగించి అర్చకులు గుండుస్వామిచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్లమానుకు బంకమట్టిని పూసి పూజలు జరిపారు. ఉట్లమాను ఎక్కే భక్తులు మేళతాళాల నడుమ ఉట్లమానువద్దకు చేరుకొని అభ్యంగన స్నానంచేసి ఉట్లమానును ఎక్కి ఉట్టికొట్టారు. ఈ కార్యక్రమం దాదాపు గంటన్నరపాటు ఆద్యంతం ఉత్కంఠభరితంగా కొనసాగగా వందలాది మంది భక్తులు పాల్గొని ఆసక్తిగా తిలకించారు. కాగా గ్రామంలో ఉట్ల పరుష సందర్భంగా ఆటబొమ్మలు, తినుబండారాల దుఖాణాలు పెద్దఎత్తున వెలియగా కొనగోళ్ళతో కిటకిటలాడాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు జరుగకుండా యుపీఎస్ సీఐ వి.హరినాథ్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

## ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై మొదలైన విచారణ

- కార్యాలయంలో రికార్డులను పరిశీలించిన ఈఓఆర్‌డీ పి.చంద్రమౌళి



రికార్డులు పరిశీలిస్తున్న ఈఓఆర్‌డీ పి.చంద్రమౌళి

**ఉరవకొండ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై వచ్చిన పిర్యాదు మేరకు మంగళవారం విచారణ ప్రారంభమైంది. ఈఓఆర్‌డీ పి.చంద్రమౌళి కార్యాలయంలో పంచాయతీ జనరల్ ఫండ్, వివిధ ఆర్థిక సంఘాల నుండి వచ్చిన నిధులు, ఖర్చులు, కంటెజ్జెన్సీ పేరుతో జరిగిన ఖర్చులకు సంబంధించిన రికార్డులపరిశీలనచేపట్టారు. ఈ సందర్భంగా ఈఓఆర్‌డీ పి.చంద్రమౌళి మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీకు చెందిన 9వ వార్డు సభ్యుడు చేజాల ప్రభాకర్ గతనెల 14వ తేదీన స్పందన కార్యక్రమంలో పంచాయతీలో నిధులదుర్వినియోగంపై పిర్యాదు చేశారన్నారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారి స్పందించి గతనెల 25న సమగ్ర విచారణకు ఆదేశించారన్నారు. అందులో భాగంగానే విచారణ చేపట్టామని విచారణ పూర్తికావడానికి మరికొన్నిరోజులు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శి ఎ.వి.రమణకుమార్ పాల్గొన్నారు.

## ఓటర్లను దగ్గరలోని పోలింగ్ కేంద్రాల పరిధిలోకి తీసుకురండి

- రాజకీయ పార్టీ సమావేశంలో అధికారులను కోరిన రాజకీయ పార్టీలు



ఎలక్టోరోల్ అధికారి గణప శంకరయ్య అధ్యక్షతన జరిగిన రాజకీయ పార్టీల సమావేశం దృశ్యం

**ఉరవకొండ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** ఓటర్లను దగ్గరలో పోలింగ్ కేంద్రాలు పరిధి లోకి తీసుకురావాలని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నియోజకవర్గ ఎలక్టోరోల్ అధికారి, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గణప శంకరయ్య అధ్యక్షతన నియోజకవర్గస్థాయి రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించగా ఉరవకొండ తహశీల్దార్ హరిప్రసాద్, బెలుగుప్ప తహశీల్దార్ ఓబులేసు, కూడేరు తహశీల్దార్ షేక్షావలి, వజ్రకరూరు ఇంచార్జ్ తహశీల్దార్ చంద్రశేఖర్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ మునీంద్ర, విడపనకల్లు తహశీల్దార్ కార్యాలయ సీనియర్ సహాయకుడు వన్నప్ప, ఎన్నికల విభాగం సీనియర్ సహాయకులు సాయిక్రిష్ణ వంశీ పాల్గొన్నారు. సమావేశంలో పోలింగ్ కేంద్రాల పరిశీలనపై చర్చించారు. ఒక పోలింగ్ కేంద్రం పరిధిలో 1,300 ఓట్లకు మించి ఉంటే కొత్తగా మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతుల కల్పనపై చర్చించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ మఠం ప్రాంతంలోని ఓట్లు సీవీవీ నగర్ పోలింగ్ కేంద్రంలో ఉండేలా, పాతపేట, నెహ్రూనగర్‌లోని ఓట్లు జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో కలపాలని కోరారు. ఒంటెద్దుబండ్ల కాలనీలోని ఓటర్లను ఇందిరానగర్‌లో పోలింగ్ కేంద్రంలో కలిపితే ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడానికి అనుకూలంగా ఉంటుందని సూచించారు. ఈ సమావేశంలో వైసీపీ ప్రతినిధి యం.బసవరాజు, టీడీపీ ప్రతినిధి ఎస్.విజయభాస్కర్, కాంగ్రెస్ ప్రతినిధి సోనియా శీనా, బీజేపీ ప్రతినిధి యం.హరిప్రసాద్‌చౌదరి. సీపీఐ ప్రతినిధి తలారి మల్లికార్జున, జనసేన పార్టీ ప్రతినిధి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా దోమల నివారణ చర్యలు చేపట్టండి

- అత్యవసర సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి యం.డి.అమృత్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్

**ఉరవకొండ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** పట్టణ, గ్రామాల్లో జ్వరాలు ప్రజలకుండా దోమల నివారణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి యం.డి.అమృత్‌రాజ్ సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన స్థానిక సీహెచ్‌సీ, రాకెట్ల, పి.కౌకుంట్ల పీహెచ్‌సీల పరిధిలోని ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్ మాట్లాడుతూ చిన్నముష్టూరు గ్రామంలో వడ్డే సుదర్శన్ అనే ఐదేళ్ల బాలుడికి డెంగ్యూ జ్వరం నిర్ధారణ అయినందున ఇతరులు ఎవరూ జ్వరాల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. పట్టణ, గ్రామాల్లో మురికినీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమ కాటు పాము కాటు కంటే ప్రమాదకరమని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమ కాటు ద్వారా డెంగ్యూతోపాటు మలేరియా, చికెన్‌గున్యా జ్వరాలు వస్తాయి కాబట్టి దోమలు పుట్టకుండా, కుట్టకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. మురికినీరు నిల్వవున్న ప్రదేశాల్లో అబేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలని, సాయంత్రం వేళల్లో ఫాగింగ్ చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందికు దోమల నివారణ మందు అబేట్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కొదండరామిరెడ్డి, రాకెట్ల పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శేఖర్, పి.కౌకుంట్ల హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**జగనన్న ఆరోగ్య సురక్షపై సచివాలయాల్లో సమీక్ష :** ఈనెల 30వతేదీ నుండి అక్టోబర్ 27 వరకు జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్ మంగళవారం పట్టణంలోని సచివాలయం-2,3లో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సీహెచ్ఓ, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ఇంటి సభ్యులెవరైనా అనారోగ్యాలతో బాధపడుతుంటే వారి వివరాలను యాప్‌లో నమోదు చేసి ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో వారికి కంటి, యూరిన్, షుగర్, బీపీ ఇతరత్రా దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం అందేలా చూడాల్సి ఉంటుందని సూచించారు.

## ఐదేళ్ల బాలుడికి డెంగ్యూ జ్వరం..!

- రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం
- యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించిన సిబ్బంది



మురికినీటి నిలువ ప్రాంతాల్లో దోమల నివారణ మందు చల్లుతున్న ఆరోగ్య సిబ్బంది

**ఉరవకొండ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రాంతం ఎల్లమ్మ ఆలయ సమీపంలో నివాసముంటున్న వడ్డే సుదర్శన్ అనే ఐదేళ్ల బాలుడికి డెంగ్యూ జ్వరం నిర్ధారణైంది. దీంతో ఉదయం గ్రామంలో మంగళవారం మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి, రాకెట్ల పీహెచ్‌పీ డాక్టర్ పావని ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. డెంగ్యూ జ్వరాల గూర్చి అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామంలో మురికినీరు నిల్వవున్న ప్రదేశాల్లో అబేట్ ద్రావకాన్ని పిచికారి చేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారి నుండి రక్తనమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పర్పంచ్ రామాంజినేయులు, పంచాయతీ కార్యదర్శి ఎ.వి.రమణ కుమార్ రాకెట్ల పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శేఖర్, ఆరోగ్య కార్యకర్త శేఖర్, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశులు, ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు, ఆశా కార్యకర్తలు ఎం.సుంకమ్మ, ఎం.నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఉరవకొండ నగర కమిటీ ఎన్నిక

- నగర కార్యదర్శిగా నిఖిల్ తేజ్



ఏబీవీపీ నూతన కార్యవర్గ బాధ్యులు

**ఉరవకొండ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉరవకొండ నగర నూతన కమిటీ ఎన్నికైంది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకులు కమలాకర్, భరత్, సుధీర్‌ల ఆధ్వర్యంలో నూతన కమిటీను ఎన్నుకున్నారు. నూతన కమిటీ నగర కార్యదర్శిగా నిఖిల్ తేజ్, సహాయ కార్యదర్శిగా మహమ్మద్ ఖలీద్, ఉపాధ్యక్షులుగా హస్సన్, వంశీ, సంయుక్త కార్యదర్శులుగా నిక్షయ్, శశికిరణ్, సోషల్ మీడియా ఇంచార్జ్‌గా సురేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి నిఖిల్ తేజ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిష్పక్షపాతంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. తమపై నమ్మకముంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 14, 15, 16 తేదీల్లో ఏపీ స్కూల్ గేమ్స్ నియోజకవర్గస్థాయి పోటీలు, ఎంపికలు

-మండల విద్యాధికారి హెచ్.ఈశ్వరప్ప

**ఉరవకొండ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** ఈనెల 14, 15, 16 తేదీల్లో మూడు రోజులపాటు ఉరవకొండ పట్టణంలోని ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏపీ స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాల బాలికల నియోజకవర్గస్థాయి పోటీలు, ఎంపికలు జరుగుతాయని మండల విద్యాధికారి హెచ్.ఈశ్వరప్ప, ఎస్.కె.ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు.వీరన్న, ఫిజికల్ డైరెక్టర్లు యం.కె.రాజేష్, అశ్రాఫ్ హుసేన్ తెలిపారు. మంగళవారం వారు స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ 14న గురువారం బాలికలకు, 15న శుక్రవారం బాలురకు, 16న శనివారం అథ్లెటిక్స్ పోటీలు, ఎంపికలు జరుగుతాయన్నారు. మండల కో ఆర్డినేటర్లు విధిగా క్రీడాకారుల యొక్క ఎంట్రీ ఫారమ్‌లు, ఎలిజిబిలిటీ ఫారం తీసుకొని హాజరు కావాల్సి ఉంటుందని వారు వివరించారు.

## ఉచిత సంతాన సాఫల్య పరీక్ష శిభిరాన్ని సద్వినియోగం చేసుకోండి



**ధర్మవరం రూరల్,సెప్టెంబర్ 12,ప్రభాతవార్త:** పట్టణంలోని సాయి నగర్ సాయిబాబా గుడి దగ్గర గల స్పందన హాస్పిటల్‌లో నేడు ఉదయం 10.30 గంటల నుండి మధ్యహ్నం ఒంటిగంట వరకు ఉచిత సంతాన సాఫల్య పరీక్ష శిభిరాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ బషీర్,డాక్టర్ సోనియాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంతానం లేని వారికి ఇదొక చక్కటి ఆవకాశం అని,మీ ఆశలను శాస్త్ర విజ్ఞానము,అనుభవం,నైపుణ్యంతో సఫలీకృతం చేయడమే మా లక్ష్యం అని తెలిపారు. ప్రముఖ కన్సల్టెంట్ ఫెర్టిలిటి స్పెషలిస్టు డాక్టర్ ప్రియాంకరెడ్డిచే వైద్య పరీక్షలను నిర్వహించబడునని వారు తెలిపారు. ఇటువంటి ఆవకాశాన్ని సంతానంలేని దంపతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 949410055,850085888, 7978113533కు సంప్రదిచ్చువచ్చునని తెలిపారు.

